క్లుప్తంగా

ప్రత్యేక విద్యుత్ అదాలత్



నెల్లూరు (వీఆర్సీసెంటర్): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి న్యాయస్థానం కృషి చేస్తుందని రిటైర్డ్ జిల్లా జడ్జి, విద్యుత్ వినియోగదారుల ప్రత్యేక అదాలత్ చైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి పేర్కొన్నారు. నెల్లూరు టౌన్‌కు సంబంధించిన విద్యుత్ వినియోగదారుల కోసం మిలీనియం సబ్‌స్టేషన్లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక అదాలత్‌లో ఆయన మాట్లాడారు. నలుగురు వినియోగదారులు తమ ఫిర్యాదులను లిఖిత పూర్వరంగా అందజేయగా, ఒక సమస్యను అక్కడికక్కడే పరిష్కరించామని చెప్పారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు తెలియజేయనున్నామని పేర్కొన్నారు. వినియోగదారులకు అందించే సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తమకు గానీ, ఆన్‌లైన్లో లేదా తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కోరారు. సభ్యులు మధుకుమార్, శ్రీనివాసబాబు, విజయలక్ష్మి, డీఈఈలు సునీల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

కొడవలూరు: బాల్య వివాహాలతో బాలికల్లో ఆరోగ్యపరంగా దుష్పరిణామాలు సంభవిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల సూచించారు. బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కొడవలూరు హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలకు 18 ఏళ్లు నిండాకే వివాహం చేయాలని కోరారు. గుడ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎంఈఓ అంకయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు రమీజా, యాస్మిన్, నాగరాజమ్మ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ హైస్కూల్లో బాలికలకు ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా, హెచ్ఎం మోహన రామలింగయ్య, ఏఎన్ఎం సలోమి, పరిమళ తదితరులు పాల్గొన్నారు.
- మండలంలోని కొత్తవంగల్లు జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా, హెచ్ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: ఇనమడుగు సెక్టార్ పరిధిలోని లేగుంటపాడు ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. వక్తృత్వ, చిత్రలేఖన, పోస్టర్ ప్రదర్శన పోటీలను జరిపి విజేతలకు బహుమతులను అందజేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ శారద, సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు అపర్ణ, మనీషా, భవాని తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీస్సులు



ఇందుకూరుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వేణుంబాక మహీధర్‌రెడ్డి మేనకోడలు కావ్య, ఆదర్శ్ వివాహాన్ని నెల్లూరులోని ఓ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. వధూవరులను మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆశీర్వదించారు. పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఏఏబీ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామాయణ మహాకావ్యంపై ప్రవచనలు



కోవూరు: రామాయణ మహాకావ్యంపై ప్రవచనలను శివానంద గిరి మాతాజీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఇనమడుగులోని సత్యానంద ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరి తీర్థ, పురుషోత్తమ తీర్థ, రామకృష్ణ తీర్థ, కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

విడవలూరు: పెన్నా నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసును శుక్రవారం నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ముదివర్తిలో గల గాంధీ నగర్ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం.. ముదివర్తిలోని పెన్నా తీరంలో తనకు సొంత పొలం ఉందని చెప్పి, అందులో నుంచి మట్టిని తోలేందుకు అనుమతులున్నాయంటూ కొన్ని నెలలుగా తరలిస్తూ సొమ్ము చేసుకోసాగారు. ఈ తరుణంలో మట్టిని ట్రాక్టర్లలో ఈ నెల 13న తరలిస్తుండగా, గమనించిన కొందరు గ్రామస్తులు.. స్థానిక వీఆర్వోకు సమాచారమిచ్చారు. దీంతో ఘటన స్థలానికి చేరుకొని ఇసుక లోడ్ చేసిన మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్లలో ఇసుక కాకుండా తవట మట్టి ఉండటంతో రూ.పది వేల చొప్పున జరిమానాను తహసీల్దార్ చంద్రశేఖర్ విధించారు. మట్టి తరలించిన భూమి ప్రభుత్వానికి చెందిందని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నరేష్ కేసు నమోదు చేశారు.

కుష్టు రహిత సమాజానికి కృషి

- కలెక్టర్ హిమాన్షు శుక్లా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హిమాన్షు శుక్లా తదితరులు

నెల్లూరు(అర్బన్): కుష్టు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు. కుష్టు వ్యాధి కేసులను గుర్తించి వైద్యం చేసేందుకు గానూ వచ్చే నెల 17 నుంచి 30 వరకు చేపట్టనున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను డీఎంహెచ్ఓ సుజాత, ఇతర అధికారులతో కలిసి కలెక్టరేట్లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు.

కుష్టు రోగులు తగ్గినా, జిల్లాలో అక్కడక్కడా కొత్త కేసులు వెలుగుచూడటం బాధాకరమని, దీనిపై వైద్యశాఖ అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా టీబీ, ఎయిడ్స్, కుష్టు నియంత్రణాధికారి ఖాదర్‌వలీ, డీఈఓ బాలాజీరావు, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



నెల్లూరు(అర్బన్): నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ, వైద్యాధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. సింహపురి స్కాన్ సెంటర్, ఆండాళ్ భాస్కర్, విజయ హాస్పిటళ్లు తదితర స్కానింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పీసీ, పీఎన్డీటీ చట్టం మేరకు నిబంధనలు పాటిస్తూ స్కానింగ్‌ను నిర్వహించాలని సూచించారు. స్కానింగ్ వివరాలను సంబంధిత ఫారమ్‌లో నమోదు చేసి వైద్యశాఖ కార్యాలయానికి ప్రతి నెలా రెండో తేదీన అందజేయాలని కోరారు. ప్రైవేట్ ఆస్పత్రులకొచ్చే రోగుల్లో ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే, అలాంటి వారిని ప్రభుత్వ వైద్యశాలలకు రెఫర్ చేసి టీబీ పరీక్షలు చేసేందుకు సహకరించాలని పేర్కొన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ చేజర్ల సుధాకర్‌రావు, పబ్లిక్ ప్రైవేట్ మిక్స్ కో ఆర్డినేటర్ హరీష్, విజయ్, ఫీల్డ్ కో ఆర్డినేటర్ సరిత తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ చెకప్ రేపు

నెల్లూరు(అర్బన్): తమ ఆస్పత్రిని స్థాపించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రూ.5500 విలువ జేసే డయాబెటిస్ హెల్త్ చెకప్‌ను రూ.1999కే పొగతోటలోని క్రెస్ట్ ఆస్పత్రిలో ఆదివారం అందించనున్నామని డాక్టర్ రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మందులు, చికిత్సపై 15 శాతం వరకు రాయితీని ఇవ్వనున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టాలు మంజూరు చేయాలంటూ ఇంటింటి ప్రచారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 31వ డివిజన్లో గల టైలర్స్ కాలనీ ప్రాంత వాసులకు ఇళ్ల పట్టాలను మంజూరు చేసి.. మౌలిక వసతులను కల్పించాలని కోరుతూ ఇంటింటి ప్రచారాన్ని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడారు. టైలర్స్ కాలనీ ఏర్పడి 25 ఏళ్లయినా, ఇప్పటికీ ఆ ప్రాంత వాసులకు ఇళ్ల పట్టాల్లేవని చెప్పారు. మౌలిక వసతులను కల్పించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేతలు కొండా ప్రసాద్, పెంచలనరసయ్య, నాగేశ్వరరెడ్డి, ఖలీల్, రహీం, జబ్బార్, సుబ్రహ్మణ్యం, గంగాధర్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు బ్యారికేడ్ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురం సెంటర్లో రోడ్డు వెడల్పు చేసిన ప్రాంతంలో కాలువ నిర్మాణానికి 20 అడుగుల లోతులో గుంతను తవ్వారు. అయితే అక్కడ ఎలాంటి సూచక బోర్డులు, బ్యారికేడ్లను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉందనే అంశమై 'ఆదమరిస్తే అంతే' అనే శీర్షికన సాక్షిలో కథనం బుధవారం ప్రచురితమైంది. మరుసటి రోజున ద్విచక్రవాహనదారుడు అందులో పడి గాయపడ్డారు. ఈ తరుణంలో స్పందించిన అధికారులు.. అక్కడ బ్యారికేడ్లు, డ్రమ్ములను ఏర్పాటు చేశారు.

విద్యుత్ అధికారులతో సమీక్ష



సీజీఎంకు పుష్పగుచ్ఛమిస్తున్న అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్, మెయింటెనెన్స్)గా నియమితులైన సురేంద్రరెడ్డి నగరానికి శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా విద్యుత్ భవన్‌లో అధికారులతో సమీక్షను నిర్వహించారు. విద్యుత్ సరఫరా, డిమాండ్, సబ్‌స్టేషన్ల నిర్వహణ, లైన్ల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛాన్ని ఎస్ఈ రాఘవేంద్రం, నోడల్ అధికారి శేషాద్రిబాలచంద్ర, ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, పరంధామయ్య, రమేష్ చౌదరి, భానూనాయక్, బెనర్జీ, డీఈఈ అశోక్ అందజేసి అభినందనలను తెలియజేశారు.

'విలక్షణ పత్రిక జమీన్‌రైతు'



శ్రీరామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బుద్ధప్రసాద్ తదితరులు

నెల్లూరు(బృందావనం): వందేళ్లు పూర్తి చేసుకుంటున్న అరుదైన తెలుగు పత్రిక జమీన్‌రైతు అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. పత్రిక వ్యవస్థాపకుడు నెల్లూరు వెంకట్రామనాయుడి తర్వాత అన్నీ తానై ఒక ఒరవడి, గుర్తింపును తీసుకొచ్చిన పత్రిక జీవప్రదాత నెల్లూరు శ్రీరామమూర్తి శత జయంతి కార్యక్రమాన్ని నగరంలోని ఓ హోటల్లో శుక్రవారం నిర్వహించారు. తెలుగు భాష, నెల్లూరు యాస, మాండలీకానికి, అద్భుతమైన రచన విధానానికి జమీన్‌రైతే సాటి అన్నారు. తొలుత శ్రీరామమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. పత్రిక సంపాదకుడు నెల్లూరు డోలేంద్రప్రసాద్, ఉప సంపాదకుడు అల్లూరు రహీం, మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, యల్లసిరి గోపాల్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, ఆర్ఎం బాషా, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వేములపాటి అజయ్‌కుమార్, దయాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



నెల్లూరు(బారకాసు): పొదలకూరు రోడ్డులో రహదారిని ఆక్రమించి నిర్మించిన ఇళ్లు, దుకాణాల తొలగింపు ప్రక్రియను టౌన్ ప్లానింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. రోడ్డు విస్తరణలో భాగంగా రంగనాయకులపేటలోని పినాకినీ పార్కుకు వెళ్లే మార్గంలో గల నిర్మాణాలను తొలగించారు. అనుమతుల్లేకుండా నిర్మిస్తే తొలగిస్తామని కమిషనర్ నందన్ స్పష్టం చేశారు.

కష్టపడి పనిచేస్తేనే పంచాయతీలకు ఆదాయం

నెల్లూరు(బారకాసు): పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేస్తేనే పంచాయతీలకు ఆదాయం చేకూరుతుందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. డిప్యూటీ ఎంపీడీఓలు, డీఎల్పీఓలు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్‌ను నగరంలోని నుడా కార్యాలయం నుంచి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్ఆర్ఎస్‌పై లేఅవుట్ దారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం తగదని సూచించారు. డీపీఓ శ్రీధర్‌రెడ్డి, నుడా సెక్రటరీ అల్లంపాటి పెంచలరెడ్డి, హిమబిందు, కాలేషా, ఏపీఓ చంద్ర, ఏఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల రాష్ట్రస్థాయి సమావేశంలో జిల్లా నేతలు



సజ్జల రామకృష్ణారెడ్డితో నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో దివ్యాంగుల రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. దివ్యాంగుల విభాగ జిల్లా అధ్యక్షుడు చల్లా మోహన్, రాష్ట్ర నేత ఆవుల నాగేంద్ర హాజరయ్యారు. అనంతరం దివ్యాంగ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరెడ్డి, పార్టీ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

క్లాప్ కేంద్రం ప్రారంభం



నెల్లూరు(అర్బన్): శరీర, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి చికిత్సను అందించేందుకు గానూ మాగుంట లేఅవుట్లోని నెల్లూరు హబ్ ఎదుట క్లాప్ అనే కేంద్రాన్ని నిర్వాహకురాలు స్రవంతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డాక్టర్ల సలహాలు, పర్యవేక్షణలో ఫిజియోథెరపీ, ఇతర ఆయుర్వేద పద్ధతుల్లో నొప్పులను నయం చేసేందుకు చికిత్సను జర్మనీలో శిక్షణ పొందిన సిబ్బందితో అందించనున్నామని చెప్పారు.

అయ్యప్ప దీక్షధారులకు భిక్ష ఏర్పాటు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): అయ్యప్ప భక్తులకు భిక్షను వెంకటేశ్వరపురంలో అయ్యప్పసేవా భక్తబృంద ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. స్థానిక వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం వచ్చే నెల 26 వరకు కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు.

జేసీని కలిసిన నుడా ఉద్యోగులు



నెల్లూరు(అర్బన్): నుడా వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జేసీ మొగిలి వెంకటేశ్వర్లును కలెక్టరేట్లో నుడా ఉద్యోగులు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేశారు. సెక్రటరీ అల్లంపాటి పెంచలరెడ్డి, ఏఓ ఈశ్వరరాజు, డిప్యూటీ తహసీల్దార్ డానియెల్ పీటర్, ముత్యం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: జేసీ మొగిలి వెంకటేశ్వర్లును కలెక్టరేట్లోని ఆయన చాంబర్లో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు శేషం సుదర్శన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అర్జీలను అందజేశారు.

అండర్ బ్రిడ్జిల్లో నీరు నిల్వ ఉండకూడదు



నీటి తోడివేత పనులను పరిశీలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలోని రైల్వే అండర్ బ్రిడ్జిల్లో వర్షపు నీరు నిల్వ ఉండకూడదని కమిషనర్ నందన్ సూచించారు. రామలింగాపురం అండర్ బ్రిడ్జిని శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. మోటార్ల సాయంతో ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. అనంతరం జయభారత్ ఆస్పత్రి ప్రాంతంలో పర్యటించిన ఆయన.. కాలువల ద్వారా వరద నీరు సజావుగా ప్రవహించేలా పూడికతీత పనులను చేపట్టాలని ఆదేశించారు. తదుపరి నవలాకుల గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న ఆటోను గమనించి డ్రైవర్‌తో మాట్లాడారు. ఇలా వ్యవహరించడం తగదని సూచించారు.

- పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి వారికి ప్రోత్సాహకాలను అందజేయడాన్ని కమిషనర్ నందన్ అభినందించారు. దీపావళిని పురస్కరించుకొని 47వ డివిజన్లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య, స్ట్రీట్ లైట్ సిబ్బందికి కానుకలను కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ అందజేశారు. కామాటివీధిలోని కృష్ణ మందిరంలో గల కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి కమిషనర్ హాజరయ్యారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి.. దుప్పట్లు, స్వీట్, బాణసంచా బాక్సులను అందజేశారు.
- నగరపాలక సంస్థ పరిధిలోని నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి, వారందర్నీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వర్తించాలని కమిషనర్ నందన్ సూచించారు. ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక బృందాలతో సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ మాధురి, అడల్ట్ ఎడ్యుకేషన్ నోడల్ ఆఫీసర్ మస్తాన్‌రెడ్డి, మెప్మా ఏఓ సుధాకర్, సూపర్‌వైజర్లు రాజశేఖర్, కృష్ణకిశోర్ తదితరులు పాల్గొన్నారు.
- నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల నుంచి అందిన వినతులకు నిర్ణీత సమయంలోపు పరిష్కారం చూపాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. ఈ మేరకు ఎంప్లాయీస్ గ్రీవెన్స్ డేను నిర్వహించారు. సెక్రటరీ శ్రీలక్ష్మి, టీపీఆర్వో వాసుబాబు, మేనేజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బిల్డర్ ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఆందోళన



సమస్యను తెలియజేస్తున్న బాధితులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ధనలక్ష్మీపురంలోని భవానీ న్యూటౌన్ వెంచర్లో మౌలిక వసతులను కల్పించకుండా బిల్డర్ శివకుమార్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని అక్కడ నివాసం ఉండే వారు ఆరోపించారు. ఈ మేరకు వారు విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. 2021లో ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్‌ను 2023 నాటికి పూర్తి చేయాల్సి ఉందని, అయితే మౌలిక వసతులను నేటికీ కల్పించలేదని ఆరోపించారు. 43 విల్లాలను నిర్మించి.. సగానికి పైగా అసంపూర్తిగా వదిలేశారని, కాలువల్లేకపోవడంతో ఇళ్లలోకి విష సర్పాలు ప్రవేశిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసి ఇలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. అధికారులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. వెంకురెడ్డి, కృష్ణాజీ, రాజేంద్ర, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ నేతకు పరామర్శ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మున్వర్, ఆయన అల్లుడు ఇటీవల గాయపడి చికిత్స పొందుతున్న క్రమంలో వారిని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. 42వ డివిజన్లోని వారి నివాసానికెళ్లి ఆరోగ్య వివరాలను ఆరాతీశారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న వైద్యులు



డాక్టర్లు, వైద్య సిబ్బంది ర్యాలీ

నెల్లూరు(అర్బన్): సీపీఆర్‌పై పీఎంపీలు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని నారాయణ ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగాధిపతి స్కంధ గోపాలకృష్ణ పేర్కొన్నారు. సీపీఆర్ వారోత్సవాలను పురస్కరించుకొని పీఎంపీ సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని నారాయణ హాస్పిటల్లో శుక్రవారం నిర్వహించారు. వివిధ అంశాలపై డెమోను నిర్వహించారు. పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, జిల్లా నేతలు శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, రామదాస్, మాలిని, ఆస్పత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడొచ్చని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ మాధవి పేర్కొన్నారు. సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా నగరంలోని పెద్దాస్పత్రి నుంచి ట్రంక్‌రోడ్డులో భారీ ర్యాలీని డాక్టర్లు, వైద్య సిబ్బంది అనస్థీషియా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఆర్‌ను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. అనస్థీషియా విభాగ హెచ్ఓడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి ఆందోళనలు



మాట్లాడుతున్న దామోదర్‌రావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల జీఓ విడుదలలో జాప్యంపై రాష్ట్ర వ్యాప్త ఆందోళనలను ఈ నెల 23 నుంచి చేపట్టనున్నామని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రావు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని యూనియన్ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. పదోన్నతులపై అనుమతులను ఆగస్ట్ 28న సీఎం చంద్రబాబు ఇచ్చారని, అయితే నేటికీ అమలు కాలేదని ఆరోపించారు. ఎలాంటి ఉద్యోగోన్నతుల్లేకుండానే రెండు వేల మంది రిటైరయ్యే అవకాశం ఉందని చెప్పారు. స్త్రీ శక్తి పథకంతో ఉద్యోగులు, ప్రయాణికుల ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగాలంటే మూడు వేల కొత్త బస్సుల కొనుగోలుతో పాటు పది వేల మంది ఉద్యోగుల అవసరం ఉంటుందని చెప్పారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు యుగంధర్, జిల్లా కార్యదర్శి ప్రసాద్, జోనల్ కార్యదర్శి దాసరి బాబూ శామ్యూల్, శ్రీనివాసరెడ్డి, ఏడుకొండలు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వితరణ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నాలుగో మైలు సెంటర్లోని దొరతోపు కాలనీ వద్ద గల నేతాజీ వృద్ధాశ్రమానికి రెండు టేబుళ్లు, నిత్యావసరాలను బాప్టిస్ట్ చర్చి డానీహాల్ షో యువర్ లవ్ ఆగాపే టీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. సభ్యులు మల్లెల కృపారాజన్, జయకుమార్, రవి, మేరీ సరళ, మేరీ బ్లెస్సింగ్టన్, వృద్ధాశ్రమ నిర్వాహకుడు సుభానీ తదితరులు పాల్గొన్నారు.